సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 1 । జనవరి । 2023







నూతన సంవత్సర వేడుకల్లో విద్యానగర్ కాలనీవాసులు



నయా.. జోష్

కాలగమనంలో మరో ఏడాది కరిగిపోయింది. కొందరికి సంతోషాలను పంచుతూ.. మరికొందరికి విషాదాన్ని మిగిల్చుతూ జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు 2022 ఏడాదికి వీడ్కోలు చెబుతూ.. 2023 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి 12 గంటలు కొట్టగానే బాణాసంచా వెలుగులు.. టపాసుల మోతలతో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. డీజే మోతలు.. బ్యాండుమేళాలతో ఆడిపాడారు.

న్యూస్‌రీల్

ముస్తాబాద్ బంద్ ప్రశాంతం



ముస్తాబాద్(సిరిసిల్ల): అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ముస్తాబాద్‌లో హిందూ సంఘాలు చేపట్టిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. హోటళ్లు, కిరాణం, వర్తక వాణిజ్య సంస్థలు, వస్త్రవ్యాపార సంస్థలు బంద్ పాటించాయి. పెట్రోల్ బంకులు, పాఠశాలలు తెరుచుకోలేదు. అయ్యప్పసేవా సమితి రాష్ట్ర ప్రతినిధి రాజుగురుస్వామి, రాంగోపాల్, బాలాజీ తదితరులు వివేకానంద విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ హిందూ దేవుళ్లపై బైరి నరేశ్ వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయన్నారు. ఇక ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. యాదగిరి, సంతోష్‌రెడ్డి, బాలాజీ, అంజాగౌడ్, మహేశ్, నర్సింలు, జగన్, కృష్ణమూర్తి, దేవేందర్, ప్రసాద్, నందు,స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సైజింగ్ కార్మికుల ఆగ్రహం



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ఎనిమిది రోజులుగా సమ్మె చేపడుతున్న సైజింగ్ కార్మికుల పోరాటం ఉధృతమైంది. సిరిసిల్లలోని తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ ఇంటి ముందు శనివారం ధర్నాకు దిగారు. సైజింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కిశోర్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.15,171 చెల్లించాలని కోరారు. మంత్రి కేటీఆర్, కలెక్టర్‌లు చర్యలు తీసుకోవాలని కోరారు. సోమిశెట్టి దశరథం, మారుపాక అంజయ్య, యూసుఫ్, వెంకటేశం, ప్రకాశ్, రమేశ్ పాల్గొన్నారు.

అదనపు టీఎంసీ పనులపై సమీక్ష

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం మూడో టీఎంసీ మోక సర్వేచేసిన ప్రాంతాల్లో వరద కాలువ పనులు ప్రారంభించాలని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీనివాసరావు, పవన్ కుమార్ సంబంధిత కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. అదనపు టీఎంసీ పనుల ప్రగతిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సమీక్షించారు. కోర్టుకెళ్లిన రైతుల భూముల్లో తప్ప, పరిహారం తీసుకున్న వారి భూముల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రత్నంపేటకు చెందిన కందారపు అమ్మాయికి మంజూరైన చెక్కును పంపిణీ చేశారు. తహసీల్దార్ దర్శెల్లి నరేశ్, వైస్ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, రంగి తిరుపతి ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీలు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీ అయ్యాయి. కరీంనగర్ సీసీఎస్‌లో అటాచ్‌గా ఉన్న నంద లింగమూర్తిని అదే స్థానంలో రెగ్యులర్ సీఐగా, అచ్చ కిరణ్‌కుమార్‌ను చందుర్తి సీఐగా, పి.మధుకర్‌ను సిరిసిల్ల పీసీఆర్‌కు, బొల్లం రమేశ్‌ను రామగుండం కమిషనరేట్ నుంచి హుజూరాబాద్ టౌన్ సీఐగా, హుజూరాబాద్ సీఐగా ఉన్న వి.శ్రీనివాస్‌ను రామగుండం కమిషనరేట్‌లోని ఎస్‌బీకి బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నవ్యత.. మరింత మెరుగ్గా

- కొంగొత్త ఊసులతో కొత్త సంవత్సరంలోకి..
- అందరికీ సంక్షేమ పథకాలు : కలెక్టర్ అనురాగ్ జయంతి
- పోక్సో కేసులపై దృష్టి : ఎస్పీ రాహుల్‌హెగ్డే
- 2023లో చేసే పనులపై 'సాక్షి'తో అధికారుల మనోగతం

సిరిసిల్ల: నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాం.. కొత్త ఏడాదిలో కొత్త ఆలోచనలు.. కొత్త ప్రణాళికలు.. కొత్త ఆశలు.. ఏది చేసినా కాస్త భిన్నంగా.. నవ్యతతో చేయాలని అందరూ ఆశిస్తారు. ఇలా గతానికంటే మరింత మెరుగ్గా చేయాలని తపిస్తారు. 2022 ముగిసిపోగా.. 2023కు స్వాగతం పలికాం.. కొత్త సంవత్సరం 'సాక్షి'గా రాజన్నసిరిసిల్ల జిల్లాలో కొత్తగా ఏం చేస్తారని జిల్లాలోని కీలకమైన అధికారులను 'సాక్షి' శనివారం పలకరించింది. వారు అనేక విషయాలను ఆవిష్కరించారు. ఆ విశేషాలు వారి మాటల్లోనే...

మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తాను



రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ పథకాలను మరింత ఎఫెక్టివ్‌గా అమలు జరిగేలా, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా పనిచేస్తాను. ప్రభుత్వ ఎజెండానే మా ప్రాధాన్యతాంశంగా భావిస్తూ.. సమర్థంగా పనిచేస్తాం. ఇప్పటికే జిల్లాలో అమలులో ఉన్న 'మన ఊరు–మన బడి' మొదటి దశ పనులను పూర్తిచేయించి, రెండోదశ పనులు చేపడతాం. దళితబంధు పథకాన్ని లబ్ధిదారులకు దీర్ఘకాలిక ప్రయోజనం దక్కేలా అమలుచేస్తాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తిచేయిస్తాం. పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తాం. సిరిసిల్ల, వేములవాడల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందేలా చూస్తాం. మౌలిక వసతులను సమకూర్చుకుంటూ.. జాతీయ స్థాయిలో నాణ్యమైన వైద్యసేవలకు గుర్తింపు పొందేలా పనిచేస్తాం. ఈ ఏడాది 'కంటివెలుగు'ను ప్రభుత్వం మళ్లీ ప్రారంభిస్తుంది. కంటి సమస్యలతో బాధపడే వారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తాం. ఇక ఆసరా పెన్షన్లు, సంక్షేమ పథకాలు ఎలాగూ అమలులో ఉన్నాయి. జిల్లాలో నిర్మాణంలో ఉన్న పనులను వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా చూస్తాం. వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగే మహాశివరాత్రి జాతరను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌లను రూపొందించి భక్తులకు దైవదర్శనాన్ని సులభతరం చేస్తాం. ప్రభుత్వ ఎజెండానే మా ఎజెండాగా ప్రాధాన్యతాంశాలను గుర్తిస్తూ అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సత్వర సేవలను అందిస్తాం.

– అనురాగ్ జయంతి, కలెక్టర్

మహిళల భద్రతకు ప్రాధాన్యం



జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అనునిత్యం పాటుపడుతామని, పోక్సో కేసుల నియంత్రణ, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకుసాగుతామని ఎస్పీ రాహుల్‌హెగ్డే పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలు, సాంకేతిక పురోగతితో పిల్లలు, యువతీ, యువకులు పెడదారి పడుతున్నారన్నారు. రెండేళ్లుగా మైనర్‌లపై జరుగుతున్న వేధింపుల్లో నియంత్రణ లేకపోగా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. చిన్నారులపై అఘాయిత్యాలు జరుగకుండా ఉండేందుకు ఇప్పటికే ఉపాధ్యాయలకు 'పాఠశాలలో రక్షణ సమ్మేళనం' పేరిట అవగాహన సదస్సు పెట్టాం. పోక్సో చట్టం గురించి అందరికీ వివరిస్తాం. సైబర్‌నేరాలను నివారించేందుకు పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తాం. కొత్తగా వచ్చిన సిబ్బందిలో అనేక మంది బీటెక్, ఎంటెక్ చేసిన వారు ఉన్నారు. వారిని సైబర్ విభాగంలో విధుల్లోకి తీసుకుంటాం. జిల్లాలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇప్పటికే షీటీమ్ బృందాలు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయి. విద్యాసంస్థల్లో గంజాయిని అడ్డుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు పోలీస్‌శాఖ తరపున అన్ని చర్యలు తీసుకుంటాం.

– ఎస్పీ రాహుల్‌హెగ్డే



అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

వేములవాడ నియోజకవర్గ ప్రజలకు అభివృద్ధి ఫలాలు దరిచేరేలా పనిచేస్తాను. వేములవాడ పట్టణం, రాజన్నగుడి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతోనే పనులు మొదలవుతాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చర్యలు తీసుకుంటున్నాం. జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నాం. వేములవాడలో ఏర్పాటు చేసిన వంద పడకల ఆస్పత్రి, రుద్రంగి, భీమారం మండల కేంద్రాల్లో 30 పడకల ఆస్పత్రులతో నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తెచ్చాం. మూలవాగుపై రెంతో వంతెన పూర్తి చేస్తాం. హన్మాజిపేట, మామిడిపల్లి వాగులపై వంతెన, వేములవాడలో రోడ్ల విస్తరణ చేపడతాం.

– రమేశ్‌బాబు, వేములవాడ ఎమ్మెల్యే

సురక్ష పట్టణంగా సిరిసిల్ల



స్వచ్ఛ సిరిసిల్లగా జాతీయకీర్తి గడించిన సిరిసిల్లను సురక్షపట్టణంగా మార్చుతాం. అన్ని వార్డుల్లో పోలీస్‌శాఖ సమన్వయంతో సీసీ సర్వేలైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పదిహేను వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కొద్ది రోజుల్లోనే క్రికెట్, వాలీబాల్, కబడ్డీ కోర్టులను అందుబాటులోకి తెస్తున్నాం. రూ.6.9 కోట్లతో లింకురోడ్లు, రూ.2.2కోట్లతో వెంకంపేటరోడ్డు విస్తరణ, రూ.5కోట్లతో కొత్త కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నాం. పేదల కోసం పెద్దూరు సమీపంలో నిర్మిస్తున్న 560 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి చేస్తాం. నర్సింగ్ కాలేజీ, రగుడు, చంద్రంపేట జంక్షన్లు అభివృద్ధి చేస్తాం.

– సమ్మయ్య, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్

ఆరోగ్య జిల్లాగా..



కొత్త సంవత్సరంలో జిల్లా ఆరోగ్యశాఖ ముందస్తు ప్రణాళికతో ఆరోగ్య జిల్లా ఆవిర్భావానికి కృషి చేస్తుంది. ఇప్పటికే రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచింది. కరోనా వైరస్ నివారణలో ఇప్పటి వరకు జీరో కేసులకు చేరాం. నూరుశాతం ప్రసూతి వైద్యసేవలు అందుతున్నాయి. నార్మల్ డెలివరీల సంఖ్య నూరుశాతం అయ్యేలా చూస్తాం. నిక్షయ ద్వారా జిల్లాలో 840 మందికి ప్రభుత్వపరంగా నెలకు రూ.500 సాయం అందిస్తున్నాం. ఉన్నతాధికారులు, ప్రభుత్వ గైడ్‌లైన్స్ పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్య సిరిసిల్లగా తీర్చిదిద్దుతాం.

– సుమన్‌మోహన్‌రావు, డీఎంహెచ్‌వో

అభ్యసన సామర్థ్యాల పెంపు



కరోనా ప్రభావంతో అనేక మంది విద్యార్థులు కనీస అభ్యసనను మరిచిపోయారు. వారిలో అభ్యసన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా 'తొలిమెట్టు'ను ముందుకు తీసుకెళ్తాం. ప్రాథమిక విద్యార్థులకు అవగాహన కలిగేలా పాఠ్యప్రణాళికలు తయారు చేయిస్తాం. పదోతరగతి విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం నుంచి పబ్లిక్ పరీక్షలకు 11 పేపర్ల స్థానంలో ఆరు పేపర్లు ఉంటాయి. మారిన పరీక్ష విధానంపై విద్యార్థులను సన్నద్ధం చేస్తాం. పరీక్షలంటే భయాన్ని తొలిగిస్తాం. 'మన ఊరు–మన బడి'పై ఫోకస్ చేస్తాం. ఈ పథకంలో మొదటి దఫాలో 172 పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు మెరుగవుతున్నాయి. ఈ పనులు త్వరలోనే పూర్తవుతాయి. పాఠశాలల్లో విద్యార్థినులపై వేధింపుల విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. గతేడాది జరిగిన కొన్ని చేదు అనుభవాలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తా.

– రాధాకిషన్, డీఈవో

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం



వేములవాడ రాజన్న గుడికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం. భక్తులకు తాగునీరు, వసతిగదులు, క్యూలైన్ల నిర్వహణ, కల్యాణకట్ట, నిత్యాన్నదానం, అన్ని రకాల పూజలు, ఉత్సవాలను బ్రహ్మాండంగా జరిపిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– కృష్ణప్రసాద్, రాజన్న ఆలయ ఈవో

వేములవాడ సుందరీకరణపై దృష్టి



వేములవాడను సుందరంగా రూపొందిస్తున్నాం. జంక్షన్‌ల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తాం. శామకుంటలో వెజిటేబుల్ మార్కెట్ పనులు పూర్తిచేస్తాం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను త్వరగా అందుబాటులోకి తెస్తాం.

– అన్వేష్, వేములవాడ మున్సిపల్ కమిషనర్

భవిత మాదే..

- స్వావలంబన దిశగా యువతరం
- స్థిరపడడమే ప్రధాన లక్ష్యం
- కొత్త సంవత్సరం వేళ యువత మనోగతం



సిరిసిల్లకల్చరల్: యువత మార్పును ఆకాంక్షించే నవతరం. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవితకు బాటలు వేసుకునే శక్తి వారిది. చదువుతున్న వయస్సులోనే ఏదైన సాధించగలమనే మనోధైర్యం వారి సొంతం. ఎంతటి తెగింపు ఉంటుందో.. అంతటి కర్తవ్య దీక్ష వారిది. నేటి యువత సాంకేతికతను వినియోగించుకుంటూ జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలనే ప్రణాళికలతో ముందుకెళ్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి వస్తున్న భారీ ఉద్యోగ నోటిఫికేషన్ల నేపథ్యంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతుంది. నూతన సంవత్సరం సందర్భంగా యువతరం ఆలోచనలు.. లక్ష్యాలు తెలుసుకుందాం..

లక్షాన్ని ఏర్పాటు చేసుకోవాలి



ప్రతి ఒక్కరూ జీవితంలో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, సాధించే వరకు ప్రయత్నించాలి. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తుంది. వీటిని సద్వినియోగం చేసుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలి. సమయాన్ని వృథా చేయకుండా పోటీపరీక్షలకు సిద్ధం కావాలి.

– జి.నరేశ్, ఎంఏ బీఈడీ

తల్లిదండ్రులు దృష్టి సారించాలి



యువత చెడు వ్యసనాల వైపు ఆకర్షితులవుతున్నారు. మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణం కూడా మత్తే. తల్లిదండ్రులు దృష్టి సారించాలి. జీవితంలో ఉన్నతంగా స్థిరపడినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుంది.

– తూముల దేవరాజు, ఎంబీఏ

యువతతోనే మార్పు



దేశంలో అవినీతి రహిత పాలన యువతతోనే సాధ్యం. ఆ దిశగా యువత అడుగులు వేయాలి. సమాజాన్ని మార్చాలంటే మనుషుల ఆలోచన విధానంలో మార్పు రావాలి. రాజకీయ నాయకులకు బానిసలుగా మారి ఉన్నతమైన జీవితాలను నాశనం చేసుకోవద్దు.

– బాలుసాని వేణు, ఎంసీఏ విద్యార్థి

మార్పు రావాలి



నేటి యువతలో మార్పు రావాలి. చాలా మంది మత్తుకు అలవాటు పడి రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న నోటిఫికేషన్లను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలి. అప్పుడే సమాజంలో పేరుతో పాటు గౌరవం దక్కుతుంది.

– జి.ప్రణీత, బీటెక్ విద్యార్థిని

ఆర్థికంగా స్థిరపడాలి



చాలా మంది మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారే. ప్రస్తుతం చాలా మంది డిగ్రీ పూర్తికాగానే సొంత కాళ్లపై నిలబడేందుకు, ఆర్థికంగా స్థిరపడేందుకు ఇష్టపడుతున్నారు. పార్ట్‌టైమ్ జాబ్ చేసుకుంటూ పోటీపరీక్షలకు సిద్ధమయ్యేవారు చాలా మంది ఉన్నారు.

– జక్కని రోహిత్, బీటెక్ విద్యార్థి

క్లుప్తంగా

సెస్ చైర్మన్‌కు సన్మానం



రామారావును సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సెస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చిక్కాల రామారావును బొప్పాపూర్ గ్రామానికి చెందిన నాయకులు శనివారం సిరిసిల్లలో కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. బొప్పాపూర్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు కోరారు. అనంతరం చిక్కాల రామారావు మాట్లాడుతూ.. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, నాయకులు రమేశ్‌గౌడ్, దేవారెడ్డి తదితరులు ఉన్నారు.

598 రోజులుగా అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వేములవాడ: కరోనా కష్టకాలంలో ప్రారంభమైన పేదలకు అన్నదానం కార్యక్రమం 598 రోజులుగా కొనసాగుతూనే ఉంది. శనివారం 150 మంది పేదలకు అన్నదానం చేశారు కరోనా కష్టకాలంలో పేదల ఆకలి తీర్చిన ట్రస్ట్ ప్రతినిధులు పలువురు అభినందిస్తున్నారు. ఇలాంటి మరిన్నీ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, నాగుల చంద్రశేఖర్, తోట రాజు, పాత సంతోష్, పాలాస రాజేందర్, ముంజ ఉమేందర్, గాలిపెల్లి శ్రీనివాస్‌చారి, నిరంజనాచారి, చల్లా సత్తయ్య, ప్రసాద్, రాజు, ఆర్ఎఫ్‌వై మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

నారసింహా.. నీవే దిక్కు !

- నాంపల్లిగుట్టపై కనీస వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- వసతులు కల్పించాలని వేడుకోలు



ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు



నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

వేములవాడఅర్బన్: చుట్టూ పచ్చని చెట్లు.. తూర్పు దిక్కున మధ్యమానేరు జలసోయగం.. పడమర వైపు వేములవాడ పట్టణం.. మధ్యలో ఎత్తయిన గుట్ట. గుట్టపై కొలువుదీరిన శ్రీలక్ష్మీనృసింహుని ఆలయం, మరో వైపు కాళీయమర్ధనం.. భక్తులను ఆకట్టుకుంటున్నాయి. వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులలో అధికసంఖ్యలో నాంపల్లి గుట్టపైగల శ్రీలక్ష్మీనృసింహునికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఇంత అద్భుతమైన గుట్టపైన భక్తులకు అన్నీ అసౌకర్యాలే స్వాగతం పలుకుతున్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

నాంపల్లి గుట్టను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ), పర్యాటకశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టపై రూ.29కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేశారు. ఆ ప్రతిపాదనలకు ఇప్పటికీ ఆమోదం లభించలేదు. గుట్టపైన పరిసరాలు పరిశుభ్రం చేసేందుకు ఇద్దరు మాత్రమే పారిశుధ్య కార్మికులు ఉన్నారు. గుట్టపైకి వచ్చే భక్తులు అక్కడే వంట చేసుకుంటుండడంతో పరిసరాలలో చెత్తాచెదారం పేరుకుపోతుంది. ఆ చెత్తను తొలగించడం ఇద్దరి కార్మికులతో సాధ్యం కావడం లేదు. ఫలితంగా గుట్టపై పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

ఇవీ సమస్యలు

- గుట్టపైన ఉన్న శ్రీలక్ష్మీనృసింహుని ఆలయం ఎదుట రేకులు లేకపోవడంతో క్యూలైన్‌లో నిల్చోవడం భక్తులకు ఇబ్బందిగా మారింది. ఎండాకాలంలో కాళ్లు బొబ్బలు వస్తున్నాయని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కాళీయమర్ధనం ముందు కూడా రేకులు వేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
- గుట్టపైన ఆలయం ఆవరణలో భక్తులకు ఆహ్లాదం కోసం గతంలో వాటర్ ఫౌంటేయిన్ ఏర్పాటు చేశారు. వాటర్‌ఫౌంటేయిన్ చుట్టూ మొక్కలను పెంచి గార్డెన్ చేశారు. కానీ వాటర్ ఫౌంటేయిన్ ఎప్పుడూ పనిచేసిన దాఖలాలు లేవు.
- కాళీయమర్ధనం లోపల ఏర్పాటు చేసిన బొమ్మలు కొన్ని విరిగిపోయాయి. కొన్నింటికి కాళ్లు, చేతులు విరిగి పడి ఉన్నాయి.
- భక్తులు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేందుకు గుట్టపై మరుగుదొడ్లు లేవు. గత మహాశివరాత్రి జాతర సమయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మూత్రశాలలు లేవు.
- నాంపల్లి గుట్టపైకి వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఘట్‌రోడ్డు వర్షానికి కోతకు గురైంది. టోల్‌గేట్ టెండర్ రెండేళ్లకు రూ.43 లక్షలు ఆదాయం ఉన్న కనీసం రోడ్డుకు మరమ్మతులు చేయడం లేదు.
- వేములవాడ-కరీంనగర్ ప్రధాన రహదారిలో నాంపల్లి గుట్టపైకి వెళ్లే ఘాట్ రోడ్డుకు కమాన్ ఉంది. ఆ కమాన్‌కు బోర్డు లేకపోవడంతో వచ్చే భక్తులకు దారి ఎటువెళ్తుందో తెలియడం లేదు. గతంలో ఉన్న బోర్డులను తీసి పక్కన పడేశారు.



మూలనపడ్డ మరుగుదొడ్లు

అధికారుల దృష్టికి తీసుకెళ్తా



నాంపల్లి గుట్టపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వాటర్ ఫౌంటేయిన్, పర్మినెంట్‌గా మరుగుదొడ్లు, మూత్రశాలల ఏర్పాటు కోసం ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు అందిస్తాను.

– ఎస్.నరేందర్, నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి

సమస్యలపై చర్చించకుండానే సమావేశం

- 24 అంశాల ఎజెండాకు ఆమోదం
- పేదల భూ రిజిస్ట్రేషన్‌ను అడ్డుకుంటున్నారు: బీజేపీ కౌన్సిలర్ నాగరాజు



సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: మున్సిపల్ సాధారణ సమావేశంలో ప్రజా సమస్యలు చర్చించకుండా, కేవలం ఎజెండాలో పొందు పరిచిన అంశాల తీర్మానానికే పరిమితం కావడంపై బీజేపీ ఫ్లోర్‌లీడర్ బొల్గం నాగరాజు ఫైర్ అయ్యారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో 24 అంశాలతో కూడిన ఎజెండాను సభ్యులకు అందించగా, వాటిని అధికార పార్టీ సంఖ్యాబలం ఉందని ఇష్టానుసారంగా ఆమోదం తెలిపారన్నారు. విలీన గ్రామానికి చెందిన నిరుపేదలు వారికి సంబంధించిన నాలుగు గుంటల భూమిలో కొంత భాగం ఆరోగ్య అవసరాలరీత్యా అమ్ముకోవడానికి చూస్తుంటే, సబ్ రిజిస్ట్రార్‌తో ఆపిస్తున్నారని ఆరోపించారు. ఈవిషయంలో కమిషనర్‌ను ప్రశ్నిస్తే సమాధానం దాటవేస్తున్నారన్నారు. ఇక విలీన గ్రామాల్లోని వార్డుల్లో ప్రజా సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లనివ్వలేదని, ఈవిషయంపై తాను పెదవి విప్పగా, నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీనిపై ప్రజలతో కలిసి న్యాయపోరాటం చేస్తామని నాగరాజు పేర్కొన్నారు.

అన్ని అంశాలకు ఓకే..

మున్సిపల్ సమావేశం సజావుగా జరిగిందని, కౌన్సిల్ ముందు ఉంచిన 24 అంశాలు పట్టణాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించినవని చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య ప్రకటించారు. మంత్రి కేటీఆర్ అందిస్తున్న నిధులతో పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దుతామన్నారు. వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెస్కాబ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): తెలంగాణ సహకార బ్యాంక్ వార్షిక క్యాలెండర్‌ను శనివారం మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆవిష్కరించారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను వివరించారు. వినియోగదారులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, పట్టణ అధ్యక్షుడు వెంకటియాదవ్, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ రాజిరెడ్డి, నాయకులు లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, దయాకర్‌రావు, రాజారాం, పిట్ల శ్రీమతి, వంగ రాఘవేందర్‌రెడ్డి, ఎగదండి స్వామి తదితరులు పాల్గొన్నారు.

25 అంశాలకు ఆమోదం

- తమ వార్డులపై వివక్ష చూపుతున్నారంటూ బీజేపీ కౌన్సిలర్ల ధర్నా



సమావేశంలో చైర్‌పర్సన్ మాధవి, కమిషనర్ అన్వేశ్

వేములవాడ: వేములవాడ మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అధ్యక్షతన జరిగింది. అధికారులు 25 అంశాలతో కూడిన ఏజెండాను చదివి వినిపించారు. అనంతరం వాటిపై చర్చించారు. 25 అంశాలపై కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. కాగా వార్డుల్లో బ్లీచింగ్ చల్లడం లేదని, ఫాగింగ్ చేయడంలేదంటూ స్వపక్ష, విపక్ష కౌన్సిలర్లు ఆరోపించారు. వెంటనే చైర్‌పర్సన్, కమిషనర్ అన్వేశ్ స్పందించి శానిటేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ డీఈ తిరుపతి, ఏఈ నర్సింహాస్వామి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిలర్ల ధర్నా

తమ వార్డుల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, నిధులు కేటాయించడంతో పాలకపక్షం వివక్ష చూపుతోందని పేర్కొంటూ బీజేపీ కౌన్సిలర్లు రేగుల సంతోష్‌బాబు, అన్నారం ఉమారాణి గేటు వద్ద ధర్నా నిర్వహించారు. కేవలం బీజేపీ కౌన్సిలర్లపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. దీంతో స్పందించిన కమిషనర్ వార్డులను సందర్శించి పనులు వేగవంతం చేయిస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ల వెంట ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, రామతీర్థపు హరీశ్ తదితరలు ఉన్నారు.

మెరుగైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుభాశ్



బోదకాల కిట్లు అందిస్తున్న సుభాశ్, నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేస్తోందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అందె సుభాశ్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో బోదకాలతో బాధపడుతున్న వారికి బోదక కిట్లను శనివారం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేసి అందరికీ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీ సుల్తానా, ఉపసర్పంచ్ బాలయ్య, గ్రామ అధ్యక్షుడు దేవయ్య, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

‘కేజీ టు పీజీ’ దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్రంలోనే మొట్టమొదటి కేజీ టు పీజీ ప్రాంగణం గంభీరావుపేటలో ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందని, ఇది దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేటలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో ఈ ఏడాది నుంచి ఎమ్మెస్సీ కంప్యూటర్‌సైన్స్, ఎంకాం కోర్సుల తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రవీందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి కేటీఆర్ చొరవతో మొట్టమొదటి కేజీ టు పీజీ ఉన్నత విద్య గంభీరావుపేటలో అందుబాటులోకి వచ్చిందన్నారు. వారం రోజుల్లో అత్యాధునిక లైబ్రరీ అందుబాటులోకి వస్తుందన్నారు. సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కళాశాల ప్రిన్సిపాల్ పిట్ల దాసు, బీసీ శాఖ డైరెక్టర్ వెంకటస్వామి, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, పట్టణాధ్యక్షుడు వెంకటియాదవ్, కొమిరిశెట్టి లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, రాజారాం, కమలాకర్‌రెడ్డి, ఎగదండి స్వామి, ఏఎంసీ చైర్‌పర్సన్ బాలవ్వ, పిట్ల శ్రీమతి, రాజనర్సు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వర్షిణి



గాదర్ల శిరీష



గాదర్ల ప్రవళిక

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లి, అచ్చన్నపల్లి గ్రామాలకు చెందిన రాయికంటి వర్షిణి, గాదర్ల శిరీష, గాదర్ల ప్రవళిక జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కాలేజీ స్థాయి స్టేట్ లెవల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వీరు ముగ్గురు ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు సోమినేని బాలు తెలిపారు. బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జనవరి 12 నుంచి 14 వరకు జరిగే జావెలిన్ త్రో పోటీలకు చెక్కపల్లికి చెందిన రాయికంటి వర్షిణి, చెన్నైలో జనవరి 9 నుంచి 12 వరకు జరిగే 800 మీటర్లు రన్నింగ్ పోటీలకు అచ్చన్నపల్లికి చెందిన గాదర్ల ప్రవళిక, అస్సాం రాష్ట్రం గౌహతిలో జనవరి 8న పది కిలోమీటర్ల రన్నింగ్ పోటీలకు అచ్చన్నపల్లికి చెందిన గాదర్ల శిరీష ఎంపికయ్యారు.



మద్యం వద్దు.. మజ్జిగ ముద్దు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నాగంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్కౌట్ విద్యార్థులు శనివారం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ‘మద్యం వద్దు.. మజ్జిగ ముద్దు’, ‘సారా వద్దు.. సల్ల ముద్దు’.. అనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ తీశారు. స్కౌట్ మాస్టర్ పాలోజీ నారాయణ, హెచ్ఎం లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ మామిండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండుసార్లు ప్రమాదం.. మంచానికే పరిమితం



మంచానికే పరిమితమైన పూర్ణచందర్



పూర్ణచందర్ ఉంటున్న రేకుల షెడ్డు

- చికిత్సకు చిల్లిగవ్వ కూడా లేని వైనం
- ప్రభుత్వ పాఠశాల పక్కన రేకుల షెడ్డులో దుర్భర జీవనం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విధివంచితుడు ఈ అభాగ్యుడు.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన జంగపల్లి పూర్ణచందర్ కాలు విరిగి మంచానికే పరిమితమయ్యాడు. చికిత్స చేయించేందుకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దానికితోడు భార్య కూడా వదిలి వెళ్లిపోవడంతో కనీస సౌకర్యాలు చూసేవాళ్లు కూడా కరువయ్యారు. పూర్ణచందర్ పరిస్థితిని గమనించిన స్థానికులు తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల గోడకు రేకులు ఏర్పాటుచేసి అందులో తాత్కాలిక వసతి కల్పించారు. ఆ రేకుల షెడ్డులో పూర్ణచందర్ దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నాడు. స్థానికుల వివరాలు.. పూర్ణచందర్ కూలీ పని చేసేవాడు. 6 నెలల క్రితం ప్రమాదం జరిగి నడుము తుంటి భాగం విరిగిపోయింది. అప్పు చేసి వైద్యం చేయించగా మెల్లిగా స్టాండుతో నడవడం ప్రారంభించాడు. కానీ విధి అతన్ని వెంటాడడంతో వారం రోజుల క్రితం ద్విచక్రవాహన రూపంలో మరో ప్రమాదం సంభవించగా తొడ భాగంలో ఎముక విరిగి పోయింది. వైద్యం చేయించుకునేందుకు డబ్బు లేక మంచానికే పరిమితమయ్యాడు. భార్య పిల్లలను తీసుకుని ఇతడికి దూరంగా ఉంటోంది. తాను వైద్యం చేయించుకునేందుకు దాతలు ఆర్థికసాయం అందించాలని బాధితుడు వేడుకుంటున్నాడు. దాతలు ఫోన్ పే లేదా గూగుల్ పే నంబర్ 99890 61659కు సాయం చేయాలని కోరుతున్నాడు.

ఐక్యతతోనే హక్కుల సాధన

సిరిసిల్లఅర్బన్: మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధిస్తామని మున్నూరుకాపు ఉద్యోగుల, విశ్రాంతి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుమాల రామనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మున్నూరుకాపుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మున్నూరు కాపు ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని, 500 మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. నిజామాబాద్ జిల్లా షాపూర్‌లో మున్నూరుకాపు కుల బాంధవుల కుల బహిష్కరణను ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కామినేని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చొక్కి రాజు, కోశాధికారి పురుషోత్తం, రామకృష్ణ, మల్లారెడ్డి హనుమండ్లు, రాజేందర్, రాంచంద్రం, దేవేందర్, శ్రీధర్, రాజు, రవీందర్, శ్రీనివాస్, గోపి, దేవయ్య తదితరులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారుల ఆందోళన



గంభీరావుపేట(సిరిసిల్ల): హిందూ దేవుళ్లను, అయ్యప్పస్వామిని కించపరిచేలా మాట్లాడిన బైరి నరేశ్‌ను చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప మాలధారులు శనివారం మండలకేంద్రంలో ఆందోళన చేశారు. ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నరేశ్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బైరి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలి

వీర్నపల్లి(సిరిసిల్ల): హిందూ దేవుళ్లను కించపరిచిన బైరి నరేశ్‌పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత అయ్యప్ప సేవా సమితి మండలశాఖ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సమితి అధ్యక్షుడు భూక్య రాములు గురుస్వామి మాట్లాడుతూ హిందూమతాన్ని కించపరుస్తూ, అయ్యప్ప స్వామి జననం గురించి అసభ్యకరంగా మాట్లాడి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన నరేశ్‌ను ఉరితీయాలని కోరారు. అనంతరం ఏఎస్సై రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు రాజేశ్, రవి, నారాయణ, లక్ష్మీనారాయణ, ముత్యం, శంకర్ పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకుసాగాలి

చందుర్తి(వేములవాడ): మహనీయుల స్ఫూర్తితో ముందుకుసాగితే విజయాలు దాసోహమవుతాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతి రమేశ్ కోరారు. చందుర్తి మండలం మర్రిగడ్డలోని అంగన్‌వాడీ-2 కేంద్రం కార్యకర్త లింగంపల్లి మమత పదోన్నతిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా రుద్రంగి సెక్టార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మమతను శనివారం సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి నరేశ్, నాయకులు బైరి రమేశ్, మేడికాల అంజయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.